బుధవారం 05-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 355, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

# ఊహించని మెజారిటీ..


- ఏపీలో కూటమి సునామీ..
- ప్రధాన ప్రతిపక్షం హోదా దక్కని వైసీపీ

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరూ ఊహించని మెజారిటీ స్థానాలు తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించింది. అధికారంలో ఉన్న వైసీపీని కోలుకోలేని విధంగా చావుదెబ్బ కొట్టింది. మొత్తం 175 అసెంబ్లీ సీట్లకు గాను టీడీపీ 136, జనసేన 21, బీజేపీ 8 సీట్లలో గెలుపొందాయి. 175 సీట్లకు 175 సీట్లు ఎందుకు గెలవం? అన్న వైసీపీ.. మిగిలిన 10 సీట్లతో సరిపెట్టుకున్నది. అందరికీ అన్నీ చేసినా ఎందుకు ఇలా అయ్యిందోనంటూ నిట్టూర్చిన జగన్.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. భారీ మెజార్టీతో గెలిచిన కూటమి తరపున ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన అమరావతిలో ప్రమాణం స్వీకరించనున్నారు. పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా నాలుగోసారి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రెండోసారి ఆయన ముఖ్యమంత్రి అవుతున్నారు.

### జగన్‌పై జనంలో తీవ్ర ఆగ్రహం

కూటమి 165 సీట్లలో విజయాన్ని కైవసం చేసుకోవడం చూస్తే ఆంధ్రులు పాలక పార్టీపై ఏ స్థాయిలో ఆగ్రహంతో ఉన్నారో తెలిసిపోతున్నది. ఇంత ఘోరంగా ఓటర్ల చేతిలో చెంప దెబ్బలు తింటామని అధికార వైసీపీ కలలో కూడా ఊహించి ఉండకపోవచ్చు. వైసీపీ ఘోర పరాభవానికి ప్రధాన కారణాలు




అనేకం ఉన్నాయి. రాష్ట్ర సచివాలయం నుంచి పాలన చేయకుండా తాడేపల్లి ప్యాలెస్ నుంచి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అధికారం చెలాయించడం, మూడు రాజధానులు చేస్తున్నామని చెప్పి అమలు చేయకుండా తాత్సారం చేయడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టులో అనామకులు సంతకం చేసినా భూమి హక్కులు బదలాయింపు ప్రక్రియ పూర్తి, **మిగతా 2లో**

### రాజధాని లేని రాష్ట్రం

ప్రతిపక్ష నాయకుడిగా జగన్ మోహన్ రెడ్డి అమరావతి రాజధానికి మద్దతు పలికి, ముఖ్యమంత్రి కాగానే మాట మార్చి, మూడు రాజధానులంటూ చెప్పడం మొదలు పెట్టారు. అమరావతిలో అసెంబ్లీ, కౌన్సిల్, విశాఖపట్నంలో సచివాలయం, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, కర్నూలు న్యాయ రాజధాని అంటూ జగన్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఊదరగొట్టారు. ఇందులో ఏదీ కార్యరూపం సాధించకపోవడం జగన్ తొలి వైఫల్యంగా చెప్పకోవాలి. రాజధాని అనేది లేకుండా చేసిన జగన్‌పై రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు కూడా ఆగ్రహంతో రగిలిపోయారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు రాజధాని ఉండగా, ఆంధ్రకు లేకపోవడం ఓటర్లను ఆలోచింపచేసిందనే చెప్పాలి.

### ల్యాండ్ టైటిలింగ్ యాక్టు

ఆంధ్రలో భూముల హక్కుల బదలాయింపుపై వివాదాస్పదమైన చట్టం జగన్ తీసుకువచ్చారు. తెలంగాణలో కేసీఆర్ ధరణి తీసుకువచ్చిన విధంగా, ఆంధ్రలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తెచ్చారు. ప్రభుత్వ అధికారితో సంబంధం లేకుండా, ప్రభుత్వం నియమించిన వ్యక్తి ఎవరైనా సరే భూముల హక్కులను ఒకరి నుంచి మరొకరికి బదలాయించే అధికారాన్ని ఈ చట్టం ద్వారా ప్రవేశపెట్టారని ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఈ చట్టం మూలంగా జగన్ అపఖ్యాతి పాలయ్యారు.



## దేశ చరిత్రలోనే అమిత్ షా భారీ మెజార్టీ

వివరాలు 2లో




## రెండు చోట్ల రాహుల్ ఘన విజయం

వివరాలు 2లో

## ప్రజల ఆప్యాయత ఏమైందో తెలియదు

- ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయి
- ప్రజల తీర్పును శిరసా వహిస్తాము
- ఎన్ని కష్టాలు పెట్టిన సిద్ధంగా ఎదుర్కొంటాం
- ఎన్నికల ఫలితాలపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



**ముందడుగు ఆంధ్రప్రదేశ్ :**

ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయి. ఊహించని విధంగా ఫలితాలు వస్తాయని **మిగతా 2లో**

## బీజేపీపై కాంగ్రెస్ స్ట్రైక్ రేట్ 29 శాతం

### 286 స్థానాల్లో ముఖాముఖి పోరు

**ముందడుగు న్యూఢిల్లీ:**

సార్వత్రిక ఎన్నికల బరిలో బీజేపీపై కాంగ్రెస్ గెలుపు శాతం (స్ట్రైక్ రేట్) గతంతో పోల్చుకుంటే మెరుగుపడింది. ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీతో ముఖాముఖి పోరులో కాంగ్రెస్ స్ట్రైక్ రేటు 2019లో 8.3 శాతం కాగా, 2024 ఎన్నికలనాటికి అది 29శాతానికి పెరిగింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 286 స్థానాల్లో ఈ రెండు పార్టీలు ముఖాముఖి తలపడ్డాయి. దీంట్లో బీజేపీ 180 స్థానాల్ని గెలుచుకుంది. కాంగ్రెస్ 83 స్థానాల్ని కైవసం చేసుకుంది. బీజేపీపై కాంగ్రెస్ స్ట్రైక్ రేట్



29శాతంగా నమోదైంది. ఈసారి కర్ణాటక, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానాల్లో బీజేపీపై కాంగ్రెస్ మెరుగైన ఫలితాల్ని అందుకుంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ స్ట్రైక్ రేట్ కేవలం 8.3శాతానికి పరిమితమైంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 370 స్థానాల్లో ఇరు పార్టీలు ముఖాముఖి పోటీపడ్డాయి.



## ఘోర పరాజయానికి భాష కూడా కారణమే

వివరాలు 4లో

ముందడుగు
బుధవారం, 05-6-2024, హైదరాబాద్

# ఊహించని మెజారిటీ..

**మొదటిపేజీ తరువాయి**

మాజీ ఎంపి వైఎస్. వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సంబంధాలు న్నాయని ఆరోపణలు ఎదుర్కోవడం, నిండు అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు భార్య భువనేశ్వరి శీలాన్ని వైసీపీ సభ్యులు శంకించడం, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అడుగుజాడల్లో నడవడం, వివేకానంద రెడ్డి హత్య విషయంలో జగన్, ఆయన సతీమణి భారతీ, ఎంపి అవినాష్‌రెడ్డిని చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీత సూటిగా విమర్శించడం, ఊరు పేరు లేని కంపెనీల మద్యం బ్రాండ్ల విక్రయం, కాపు రిజర్వేషన్లు... వైసిపి ఘోర పరాజయానికి కారణంగా చెప్పుకో వాల్సి ఉంటుంది. ఇన్ని తప్పిదాలపై ఆలోచన లేకుండా, సమీక్షించు కోకుండా జగన్ 'నేను' అనే పూర్తి అహంభావంతో ప్రజలకు ఉచితా లను అందించాను, గెలుస్తాననే ధీమాలో ఉండిపోయారు. అభివృద్ధి కార్యక్రమాలను వెచ్చించాల్సిన సొమ్మును కూడా పుట్నాలు, బొంగు పేలాల మాదిరి పంచేసి ఓటర్లను తన వైపునకు తిప్పుకోవాలని చేసిన ప్రయత్నాలకు చావుదెబ్బ కొట్టారు. ఇప్పట్లో వైసీసీ పుంజుకుని పునర్వై భవం సాధించడం, చంద్రబాబు నాయుడు ఆ పార్టీని బతకనిస్తాడని అనుకోవడం అసాధ్యమేనన్న అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఊరూ వాడా తిరిగిన చెల్లెళ్లు**

మాజీ ఎంపీ వైఎస్.వివేకానంద రెడ్డి దారుణ హత్య కేసులో జగన్ మోహన్ రెడ్డితో పాటు ఆయన భార్య భారతి, ఎంపీ అవినాష్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసును సీబీఐ విచారిస్తున్నది. ప్రత్యక్ష భాగస్వామ్యం ఉందంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డిని జగన్, భారతి కా పాడుతున్నారని, అరెస్టు కాకుండా చక్రం తిప్పుతున్నారని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఊరూ వాడా తిరిగి ప్రచారం చేశారు. వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత ఈ కేసులో ప్రత్యక్షం గా పోరాడుతున్నారు. అక్కా చెల్లెళ్లు కలిసి జగన్ నైతికతకు మసకబారే లా ప్రచారం చేసి, ప్రజల ముందు దోషిగా నిలబడేలా చేశారని ఈ ఫలితాలు తేల్చి చెబుతున్నాయి.

# రేవంత్ రెడ్డి కంచుకోటలో డీకే అరుణ గెలుపు

## బీజేపీ అభ్యర్థిగా సంచలన విజయం నమోదు

**ముందడుగు మహబూబ్‌నగర్:**





తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న తన కంచుకోట మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియో జకవర్గంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ సంచలన విజయాన్ని నమోదు చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెం ట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలం తా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. డీకే అరుణ మొదటిసారి కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పంతల్ మండలంలో జెడ్పిటిసిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభిం చారు. ఆ తర్వాత ఆమె టీడీపీలో చేరారు. 1996లో మొదటిసారి మహబూబ్‌నగర్ లోక్‌సభ నియో జకవర్గంలో నుంచి టీడీపీ పార్టీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్య ర్థి మల్లికార్జున్ చేతిలో 3,700 ఓట్ల తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి.. 1999లో గద్వాల్ శాసనసభ స్థానంలో కాంగ్రెస్ తరపున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి గట్టు భీముడు చేతిలో మరోసారి ఓటమిపాలైంది. 2004లో కాంగ్రెస్ టికెట్టు లభించ కపోవడంతో కాంగ్రెస్ తిరుగుబా టు అభ్యర్థిగా సమాజ్‌వాదీ పార్టీ తరపున పోటీచేసి విజయం పొంది తొలిసారిగా శాసనసభలో ప్రవేశిం చింది. 2007లో సమాజవాదీ పార్టీ నుంచి బహిష్కరణకు గురై.. వైఎస్సార్ సమక్షంలో మరలా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2009 ఎన్నికల్లో మరోసారి గద్వాల్ నుంచి పోటీ చేసి 10,331 మెజారిటీతో గె లుపొందారు. వరుసగా రెండో సారి శాసనసభ్యురాలిగా ఎన్నికకావడమే కాకుండా రాష్ట్రమంత్రివర్గంలో చిన్న తరహా పరిశ్రమల శాఖామంత్రిగా నియమితురాలైంది. 2014 ఎన్నిక ల్లో గద్వాల్ నియోజకవర్గంలో 8వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలైంది. 2019లో ఎంపీ టికెట్ దక్కపోవడంతో బీజేపీలో చేరారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్ని కల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయింది.

# ప్రజల ఆప్యాయత ఏమైందో తెలియదు

**మొదటిపేజీ తరువాయి**

అనుకోలేదని ఏపీలో ఓటమిపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక వ్యా ఖ్యలు చేశారు. రాష్ట్రంలోని అవ్వతా తలు, అక్కాచెల్లెమ్మలు, రైతన్నలు చూయించిన ఆప్యాయత, ప్రేమా నురాగాలు ఫలితాల్లో ఏమయ్యో యో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని పెన్షన్‌ను పెంచి అవ్వ,తాతల ఇంటి వద్దకే వెళ్లి అందజేశాం. వారి ఆప్యాయత ఏమైందో తెలియదు. అక్క చెల్లెలకు అన్ని రకాలుగా అండగా ఉన్నాం. జీరో వడ్డీ, ఆసరా, చేయూతను అందించాం, కోటి 5 లక్షల మంది అక్క చెల్లెల్ల ప్రేమాభిమానులు ఏమ య్యాయో తెలియదని అన్నారు. పిల్లల చదువుల కోసం 12 లక్షల తల్లులు అకౌంట్లోకి డబ్బులు జమ చేశారు. 54 లక్షల మంది రైతన్నల కు పెట్టుబడి సహాయం ఇచ్చాం. వీరి ఆప్యాయతా ఏమైందో తెలియదని అన్నారు. కోట్లాది మందికి మంచి చేసినా ఎక్కడ పొరపాటు జరిగిందో ఊహించలేక పోతున్నామని జగన్ తెలిపారు. అందరికీ మంచి జరగా లని ఆరాటపడ్డాం. ప్రజల కోసం మేలు జరుగాలని తాపత్రయప డ్డాం. ఎప్పుడు చూడని విధంగా మార్పులు తీసుకువస్తూ పేదలకు అండగా పనిచేశాం. గొప్ప పనులు చేసినా తరువాత వారి అభిమానం, ఆప్యాయత ఏమైందో తెలియని వి వరించారు. ఏం జరిగిందో దేవుడికి తెలుసు. ఓటమి నెపాన్ని ఎవరిని ప్ర శ్నించమని, ప్రజల తీర్పును శిరసా వహిస్తామని పేర్కొన్నారు. పేదలకు అండగా ఉంటాం . పేదల పక్షాన అసెంబ్లీలో ప్రతిపక్షంగా గళం వి ప్పుతామని స్పష్టం చేశారు.

**కూటమి నేతలకు అభినందనలు**

ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు, పవన్‌కల్యా ణ్, బీజేపీ నాయకులకు అభినందన లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉండడం తమకు కొత్తేమి కాదని, రాజకీయ జీవితంలో ఎవరూ చూడని కష్టాలు అనుభవించాం. అంతకన్నా కష్టాలు ఇప్పుడు పెట్టినా కూడా సిద్ధంగా ఉన్నాం. సిద్ధంగా ఎదుర్కొంటామని ఆయన వెల్లడించారు.

# రెండు చోట్ల రాహుల్ ఘన విజయం

- వయనాడ్‌లో 3.5 లక్షలపైగా మెజార్టీ
- రాయబరేలీలో 3.7 లక్షల పైచిలుకు ఆధిక్యం

**ముందడుగు జాతీయం:**



లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు చోట్లా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఘన విజయం సాధించారు. కేరళలోని వయనాడ్‌లో.. తన సమీప సీపీఐ అభ్యర్థి యానీ రాజాపై 3.5లక్ష లపైగా మెజార్టీతో రాహుల్ విజయం సాధించారు. ఉత్తరప్రదేశ్‌లోని తమ కంచుకోట రాయబరేలీలో 3.7లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యంతో రాహుల్ గాంధీ గెలిచారు. 2019 ఎన్నికల్లో సోనియా గాంధీకి వచ్చిన మెజార్టీని రాహుల్ గాంధీ దాటేశారు. గత ఎన్నికల్లో ఆమెకు రాయబరేలీలో 1.67 లక్షల ఓట్ల మెజార్టీ వచ్చింది. రాయబరేలి నియోజకవర్గానికి 2004 నుంచి సోనియాగాంధీ ప్రా తినిధ్యం వహిస్తున్నారు. అయితే ఈసారి లోక్‌సభ ఎన్నికల దూరంగా ఉంటున్నట్లు ప్రకటిస్తూ ఆమె రాజ్య సభకు వెళ్లారు. దీంతో రాయబరేలి నుంచి రాహుల్ ఎన్నికల బరిలోకి దిగారు. రెండు స్థానాల్లో విజయం సాధించిన రాహుల్ ఏ స్థానానికి రాజీనామా చేస్తారనే ప్రశ్న ఇప్పుడు అందరిలో నెలకొంది. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ అక్కడ భారీ సంఖ్యలో సీట్లను గెలిచి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. కానీ, ఈసారి బీజేపీకి యూపీలో ఎదురుగా లి వీచింది. అక్కడ ఇండియా కూటమి అనూహ్యంగా పైచేయి సాధించింది. గత ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి యూపీలో 65 స్థానాల్లో విజయం సాధించిన కమలదళం.ఈసారి మాత్రం గతం కంటే సగం సీట్లను కోల్పోయింది. అఖిలేశ్ నాయకత్వం లోని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు కలిసి పోటీచేసి మంచి ఫలితాలను అందుకున్నాయి. గత ఎన్నికల్లో కోల్పో యిన కంచుకోట అమేథీని కాంగ్రెస్ తిరిగి చేజిక్కించుకుంది. అమేథీలో గత ఎన్నికల్లో రాహుల్ గాంధీపై పోటీ చేసి గెలిచిన స్మృతీ ఇరానీ ఈ ఎన్నిక ల్లో ఓటమి పాలయ్యారు.

# దేశ చరిత్రలోనే అమిత్ షా భారీ మెజార్టీ

## కాంగ్రెస్ అభ్యర్థిపై 7,44,716 ఓట్ల తేడాతో విజయం

**ముందడుగు జాతీయం:**



లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 272 సీట్లు మెజార్టీని ఎన్డీయే కూటమి దాటేసింది. 294 స్థానా ల్లో ఎన్డీయే కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. ఎన్డీఏ కూటమికి తొలి విజయం దక్కింది. గుజరా త్‌లోని గాంధీనగర్ నుంచి పోటీచే స్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ రమణ్‌భాయ్‌పై 7,44,716 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో అమిత్ షాకు 10,10,972ఓట్లు రాగా, రమణ్‌భాయ్‌కి 266256 ఓట్లు పోలయ్యాయి. ఇక బహుజన్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మహ మ్మద్ అనీశ్ దేశాయ్‌కి డిపాజిట్ దక్కలేదు.

బీజేపీకి సొంతంగా కేంద్రంలో ప్ర భుత్వం ఏర్పాటు చేయడానికి అవ సరమైన 272 లోక్ స సీట్లు వచ్చే అవకాశం లేనట్లు స్పష్టంగా కన బడుతోంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఖాయంగా కనబడుతు న్నప్పటికీ.. బీజేపీకి గత రెండు లోక్ సభ ఎన్నికల్లో మాదిరిగా సొంతంగా 272 పైనే సీట్లు వచ్చే ఛాన్స్ లేదని తెలుస్తోంది. బీజేపీ సొంతంగా 240 స్థానాల్లో ఆధి క్యంలో కొనసాగుతుంది. దీంతో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ.. ఎన్డీయే కూటమిలో ముఖ్య పార్టీలు అయిన తె లుగుదేశం, జేడీయూలపై ఆధారాపడాల్సి ఉంటుంది. జేడీయూ కంటే టీడీపీకే ఎక్కువ లోక్ సభ స్థానాల్లో ఆధిక్యం లో ఉండటంతో కేంద్రంలో మరోసారి చంద్రబాబు చక్రం తిప్పే అవకాశం కనబడుతోంది.

ముందడుగు
బుధవారం, 05-6-2024, హైదరాబాద్

# అన్న పతనాన్ని కళ్లారా చూసిన చెల్లెలు

- జగన్‌పై పగ తీర్చుకున్నారంటూ ప్రశంసలు
- వైకాపా దారుణ ఓటమిలో షర్మిల పాత్ర

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా వెలువడిన ఫలితాలు తెలుగుదేశం పార్టీలో ఊహించలేని జోష్‌ను నింపాయి. తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీ ఉమ్మడి కూటమి అనుకోని సీట్లను సాధించింది. ఈ నేపథ్యంలో అనూహ్య పరిణామాలు ఏర్పడుతున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయనున్నారు. త్వరలోనే ఆయన గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేయనున్నారు.

వైఎస్ఆర్సీపీ పార్టీ కనీసం 20 సీట్లను కూడా దక్కించుకోలేనంత దీనస్థితికి చేరింది. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి కనీసం 23 సీట్లయినా లభించాయి. అయిదు సంవత్సరాలు తిరిగే సరికి వైఎస్ఆర్సీపీ పరిస్థితి అంతకంటే దారుణంగా మారింది. వైఎస్ జగన్ కేబినెట్‌లోని దాదాపు మంత్రులందరూ ఓటమి పాలయ్యారు. వైఎస్ఆర్సీపీ కంచుకోటలుగా భావించే నియోజకవర్గాలన్నీ కుప్పకూలిపోయాయి. టీడీపీ జనసేన బీజేపీకి కలిపి 160కి పైగా అసెంబ్లీ స్థానాలు ఖరారయ్యాయి.

వైఎస్ఆర్సీపీ సాధించిన ఈ ఘోర పరాజయం నేపథ్యంలో ఏపీ మొత్తానికీ అత్యంత సంతోషంగా ఉండే వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధినేత్రి వైఎస్ షర్మిల. ఆమె కంటే మోస్ట్ హ్యాపియెస్ట్ పర్సన్ మరొకరు ఉండకపోవచ్చు. వైఎస్ఆర్సీపీ పతనాన్ని ఆమె ఆస్వాదించినంతగా మరెవరూ ఆస్వాదించకపోవచ్చు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో వైఎస్ షర్మిల ట్రెండ్ సృష్టిస్తోన్నారు. వైఎస్ఆర్సీపీ వ్యతిరేక వర్గం మొత్తం కూడా ఆమెను ఆకాశానికెత్తేస్తోంది. తన అన్న వైఎస్ జగన్‌పై పగ తీర్చుకున్నారంటూ ప్రశంసిస్తోన్నారు. వైఎస్ఆర్సీపీ దారుణ ఓటమిలో షర్మిల సైతం ఓ చెయ్యి వేసిందంటూ కామెంట్స్ పోస్ట్ చేస్తోన్నారు

# స్మృతి ఇరానీ ఓటమిపై ప్రియాంక పోస్ట్

- కిశోరీ లాల్ భయ్యా గెలుస్తారని నాకు తెలుసు
- నియోజకవర్గ ప్రజలకు అభినందనలు

**ముందడుగు జాతీయం:**





కాంగ్రెస్ పార్టీ కంచుకోట అయిన అమేఠీ స్థానాన్ని కాంగ్రెస్ తిరిగి చేజిక్కించుకుంది. ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ కేంద్రమంత్రి స్మృతి ఇరానీపై విజయం సాధించారు. దీనిపై ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ ఆనందం వ్యక్తం చేశారు. ఆమె సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు పెట్టారు. ''కిశోరీ లాల్ భయ్యా మీరు గెలుస్తారని నాకు తెలుసు. మీ విషయంలో నేనెప్పుడూ సందేహించలేదు. మీకు, నియోజకవర్గంలోని నా ప్రియమైన సోదర, సోదరీమణులకు అభినందనలు'' అని రాసుకొచ్చారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని స్మృతి ఇరానీ ఓడించి.. దశాబ్దాల తర్వాత గాంధీ కుటుంబం నుంచి అమేఠీ సీటును కైవసం చేసుకున్నారు. అప్పుడు వయనాడ్ నుంచి రాహుల్ గెలుపొందారు. 2024 ఎన్నికల్లో వయనాడ్‌తోపాటు.. అమేఠీలో కూడా రాహుల్ పోటీ చేస్తారని తొలుత ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో రాహుల్ రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్ తరఫున గాంధీల కుటుంబానికి నమ్మకస్థుడైన శర్మను రంగంలోకి దింపారు. ప్రస్తుతం రెండు స్థానాల్లోనూ రాహుల్ గెలుపొందగా.. అమేఠీని కూడా కాంగ్రెస్ సొంతం చేసుకుంది.

# ఉద్యమ పార్టీకి ఒక్క సీటు రాకపోవడమా

- ఫలితాలు తీవ్ర స్థాయిలో నిరాశపరిచాయి
- రాష్ట్రంలో త్వరలోనే మళ్లీ పుంజుకుంటాం
- కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ట్వీట్

**ముందడుగు హైదరాబాద్:**



లోక్ సభ ఫలితాలు తమని తీవ్ర స్థాయిలో నిరాశపరిచాయని, పార్టీని స్థాపించి 24 ఏళ్ల సుదీర్ఘప్రయాణంలో ఎన్నో ఎత్తు పల్లాలను చూశామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నికల ఫలితాలపై స్పందించారు. ఎన్నికల్లో విజయం కంటే తెలంగాణను సాధించడమే తమకి పెద్ద గౌరవమని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. త్వరలోనే పుంజుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

"బీఆర్ఎస్ స్థాపించిన 24 ఏళ్లలో అన్నీ చూశాం. అఖండ విజయాలు, అనేక ఎదురుదెబ్బలు తగిలాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మన అతి పెద్ద విజయంగా మిగిలిపోతుంది. ప్రాంతీయ పార్టీ అయినా వరుసగా రెండు సార్లు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. 2014 ఎన్నికల్లో 63/119 సీట్లు, 2018 ఎన్నికల్లో 88/119 బీఆర్ఎస్ పార్టీ సాధించింది. ప్రస్తుతం అసెంబ్లీలో 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్నాం. నేటి ఎన్నికల ఎదురుదెబ్బ ఖచ్చితంగా చాలా నిరాశపరిచింది. మరింత కష్టపడి ఉన్నత శిఖరాలను చేరుకుంటాం. ఫీనిక్స్ పక్షి లెక్క కింద నుంచి పైకి వస్తాము" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో ఉద్యమ పార్టీగా చెప్పుకునే బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. గత ఎన్నికల్లో బీజేపీ 4 సీట్లకు పరిమితమవ్వగా.. ఈసారి ఆ సంఖ్యను డబుల్ చేసుకుంది. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ జరిగింది. మొత్తం 17 స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీలకు చెరో ఎనిమిది సీట్లు రాగా.. మిగిలిన ఒక్క సీటును ఎంఐఎం దక్కించుకుంది.

# ఒక అన్నగా నిన్ను చూస్తుంటే గర్వంగా వుంది

**మెగాస్టార్ చిరంజీవి హుషారెత్తించే ట్వీట్ • చంద్రబాబు గెలుపుపై కూడా శుభాకాంక్షలు**

**ముందడుగు తెలంగాణ:**



మెగాస్టార్ చిరంజీవి జనసేన వర్గాలను హుషారెత్తించే ట్వీట్ చేశారు. ''డియర్ కళ్యాణ్ బాబు.. ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని నెగ్గించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు Game Changer వి మాత్రమే కాదు, Man of the match వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది!! నీ కృషి, నీ త్యాగం, నీ ధ్యేయం, నీ సత్యం జనం కోసమే! ఈ అద్భుతమైన ప్రజా తీర్పు, రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం, అలాగే నీ కలల్ని, నువ్వు ఏర్పరుచుకున్న లక్ష్యాల్ని నిజం చేసే దిశలో నిన్ను నడిపిస్తాయని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తూ, శుభాభినందనలు. నీవు ప్రారంభించే ఈ కొత్త అధ్యాయంలో నీకు శుభం కలగాలని, విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను'' అని పేర్కొన్నారు. అదేవిధంగా చంద్రబాబు గెలుపుపై ట్వీట్ చేస్తూ.. ''ప్రియమైన చంద్రబాబు నాయుడు గారికి, చరిత్రలో అరుదైన విజయాన్ని అందుకున్న మీకు ముందుగా శుభాకాంక్షలు, అభినందనలు. ఈ మహత్తర విజయం, మీ మీద ప్రజలకు వున్న నమ్మకానికి, మీ నాయకత్వ పటిమకు, రాష్ట్రానికి గత వైభవం తిరిగి తేగలిగిన మీ దక్షతకు నిదర్శనం. రాజకీయ దురంధరులైన మీ మీద, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోడీ గారి మీద ప్రజలు కనపరచిన విశ్వాసాన్ని సంపూర్ణంగా నిలబెట్టుకొని, రాజధాని లేని, గాయపడిన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టి నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను'' అని పేర్కొన్నారు చిరంజీవి.

ముందడుగు
బుధవారం, 05-6-2024, హైదరాబాద్

## వైకాపా గెలిచిన 11 అసెంబ్లీ స్థానాలు ఇవే..



**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**
సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైకాపా ఘోర పరాజయం పాలైంది. 175 అసెంబ్లీ సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని బరిలో దిగిన ఆ పార్టీ 11 స్థానాలతోనే సరిపెట్టుకుంది. పులివెందుల నియోజకవర్గంలో గతంలో కంటే జగన్‌కు మెజార్టీ తగ్గింది. జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా వైకాపా కేబినెట్‌లోని మంత్రలంతా ఓటమి పాలయ్యారు.

**వైకాపా గెలిచిన అసెంబ్లీ స్థానాలివే..**

**పులివెందుల:** వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
**బద్వేలు:** దాసరి సుధ
**పుంగనూరు:** పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
**మంత్రాలయం:** వై.బాలనాగిరెడ్డి
**ఆలూరు:** బూసినే విరూపాక్షి
**యర్రగొండపాలెం (ఎస్సీ):** తాటిపత్రి చంద్రశేఖర్
**అరకు(ఎస్టీ):** రేగం మత్స్యలింగం
**పాడేరు (ఎస్టీ):** మత్స్యరాస విశ్వేశ్వరరాజు
**రాజంపేట:** ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి
**తంబళ్లపల్లి:** పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి
**దర్శి:** బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

# ఘోర పరాజయానికి భాష కూడా కారణమే

- ఇష్టానుసారంగా మంత్రులు మాట్లాడిన భాష
- రాయలేని రీతిలో ముఖ్యనేతలు వాడిన పదాలు
- కనీస బాధ్యత లేకుండా మాట్లాడిన మాటలు

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైకాపా పార్టీ అత్యంత ఘోరమైన ఓటమి పాలయింది. ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీ కనీస స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. ఇంతటి ఘోర పరాభవానికి ప్రధానంగా చెప్పుకోవాల్సిన కారణం ఆ పార్టీకి చెందిన మంత్రులు, ముఖ్యనేతలు వాడిన భాష. అది వైకాపా పట్ల ప్రజల్లో చులకన భావం కలిగేలా చేసింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక రాజకీయాల్లో విపరీత పోకడలు మొదలయ్యాయి. రాజకీయ ప్రత్యర్థుల్ని ఆగర్భ శత్రువుల్లా చూడటం, రాయలేని రీతిలో తిట్టించడాన్ని వారి పనితీరుకు కొలమానంగా వైకాపా అగ్రనాయకత్వం భావించింది.



### పదేపదే చంద్రబాబు, పవన్‌పై వ్యక్తిగత విమర్శలు

తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, నారా లోకేశ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా వైకాపా మంత్రులు వ్యవహరించారు. శాసనసభ ప్రతిష్ఠను మంటగలిపారు. నిండు సభలో చంద్రబాబుపై కొందరు వైకాపా ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రతిపక్ష నేతగా ఆయనకు ఉన్న హక్కును కూడా కాలరాశారు. వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా నియంతృత్వ పోకడలతో నడుపుతున్న కౌరవ సభలో ఉండలేనంటూ చంద్రబాబు బయటకు వెళ్లారు. మళ్లీ సీఎంగానే అడుగు పెడతానంటూ శపథం చేశారు. మరోవైపు పవన్‌కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి సీఎం జగన్ సహా మంత్రులు పదేపదే వ్యాఖ్యలు చేశారు. మూడు పెళ్లిళ్లంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. చంద్రబాబు కుటుంబంతో పాటు పవన్‌పై వైకాపా నేతలు వాడిన భాష ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.

ఈ ఎన్నికల్లో దాని ప్రభావం ప్రజా తీర్పు రూపంలో స్పష్టంగా వెల్లడైంది. బూతుల్లో ఆరితేరిన వారంతా నేడు ఓటమి పాలయ్యారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. గుడివాడలో కొడాలి నాని, పెనమలూరులో జోగి రమేశ్, పలాసలో సీదిరి అప్పలరాజు, నగరిలో ఆర్కే రోజాకు ఓటమి తప్పలేదు. మచిలీపట్నం నుంచి పేర్ని నాని తన కుమారుడు క్రిష్ణమూర్తి (కిట్టు)ని బరిలోకి దించినా పరాజయం నుంచి తప్పించుకోలేకపోయారు.

### అధిష్ఠానం వద్ద మెప్పు కోసం అసభ్య పదజాలం

అధికారంలో ఉన్న పార్టీపై ఎన్నో విమర్శలు, ఆరోపణలు రావడం అత్యంత సహజం. చేతనైతే వాటికి హుందాగా సమాధానం చెప్పగలగాలి. కానీ బాధ్యత గల పదవుల్లో ఉన్న మంత్రులు సైతం ఆ పని చేయలేదు. అంబటి రాంబాబు, సీదిరి అప్పలరాజు, జోగి రమేశ్, ఆర్కే రోజాతో పాటు తొలి రెండున్నరేళ్లు మంత్రులుగా పనిచేసిన కొడాలి నాని, పేర్ని నాని, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వాడిన భాష అత్యంత జుగుప్సాకరం. ప్రతిపక్ష నేతల విమర్శలకు హుందాగా సమాధానం చెప్పాల్సిన వాళ్లు.. ప్రతిపక్ష నేతలపై ఇష్టారీతిన బూతు పురాణంతో విరుచుకుపడ్డారు. ప్రజలు వినలేని, రాయలేని పదాలతో తిట్టిపోశారు. అసభ్య పదజాలం వాడితేనే తమ అధిష్ఠానం వద్ద మార్కులు పడతాయని భావించారు. పార్టీ అధినేత మనసెరిగిన కొందరు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు వారి స్థాయిని, హోదాను మర్చిపోయారు. శాసనసభలో ఉన్నామా, బహిరంగ సభలో మాట్లాడుతున్నామా... అన్నది కూడా చూసుకోకుండా ప్రతిపక్ష పార్టీల నాయకుల్ని దారుణమైన బూతులు తిట్టించడం పరిపాటిగా మారింది.

# ఢిల్లీలో బీజేపీ క్లీన్‌స్వీప్

## 7కు 7 నియోజకవర్గాల్లో విజయం ▪ సుష్మా స్వరాజ్ కూతురు బన్సూరి గెలుపు



**ముందడుగు న్యూఢిల్లీ :**
దేశ రాజధాని ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. ఏడు నియోజకవర్గాలకు గానూ ఏడింటినీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా బీజేపీకి అడ్డకట్ట వేయలేకపోయాయి. 2014, 2019 ఎన్నికల్లోనూ ఢిల్లీలోని ఏడు స్థానాలను దక్కించుకున్న బీజేపీ ఈసారి కూడా అవే ఫలితాలను పునరావృతం చేసింది. కొత్త అభ్యర్థులతో రంగంలోకి దింపి విజయాన్ని అందుకుంది. అయితే, గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీజేపీ అభ్యర్థుల మెజారిటీలు మాత్రం భారీగా తగ్గాయి. న్యూఢిల్లీ స్థానం నుంచి సుష్మా స్వరాజ్ కూతురు, బీజేపీ అభ్యర్థి బన్సూరి స్వరాజ్ 78 వేల మెజారిటీతో ఆప్ అభ్యర్థి సోమ్‌నాథ్ భారతిపై విజయం సాధించారు. ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్‌పై బీజేపీ అభ్యర్థి మనోజ్ తివారి 1.38 లక్షల మెజారిటీతో గెలుపొందారు. కాగా, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు సానుభూతి ఎన్నికల్లో కనిపించలేదు. ఆయన జైలు నుంచి అనుమతి తీసుకొని వచ్చి ప్రచారం చేసిన తన పార్టీ అభ్యర్థులను గెలిపించుకోలేకపోయారు.